నేడు ఏబీకే గ్రంథావిష్కరణ సభ

సిటీబ్యూరో, జూలై 31(నమస్తే తెలంగాణ): సుప్రసిద్ధ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్ జీవన సాఫల్య అభినందన సభ-ఏబీకే గ్రంథావిష్కరణ సోమాజిగూడలో గురువారం ఉదయం 10:30 గంటలకు జరగనుందని వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా డా. సంజయ్ బారు, విశిష్ట అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ సంపాదకులు డా.కె.రామచంద్రమూర్తి, ఆంధ్రజ్యోతి సంపాదకులు డా. కె.శ్రీనివాస్, విశాలాంధ్ర సంపాదకులు ఆర్.వి.రామారావు పాల్గొంటారని వివరించారు.

మున్నూరుకాపు ప్రతిభా పురస్కారాలకు గడువు పొడిగింపు

కాచిగూడ, జూలై 31: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తుల మేరకు 2023-24 ప్రతిభా పురస్కారాలకు గడువు పొడిగిస్తున్నట్లు మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్.వెంకట్‌రావు తెలిపారు. బుధవారం కాచిగూడ ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2023-24 విద్యా సంవత్సరం పదవ తరగతి, ఇంటర్మీడియట్ 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 040-24658160, 24657404, 94916 27404లో సంప్రదించాలని కోరారు.

11న సాంస్కృతిక, సాహిత్య పోటీలు

చిక్కడపల్లి, జూలై 31: సర్వే జనా సుఖినోభవంతు(సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ) ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన సంస్కృతికి సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ స్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్.నారాయణ మాస్టార్ తెలిపారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం శుభ సందర్భాన్ని పురస్కరించుకొని గాయనీగాయకుల్లో, నృత్య కళాకారుల్లో, కవుల్లో, రచయితల్లో, బాలబాలికల్లో దేశభక్తిని పెంపొందించి వారి ప్రతిభ పాటవాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆగస్టు 11న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాంస్కృతిక, సాహిత్య, కవితలు, దేశభక్తి గీతాలు, దేశభక్తి నృత్యాలు, శాస్త్రీయ జానపద, ఫిలిం, సోలో, డ్యుయేట్, గ్రూప్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కిడ్స్ పోటీలు కిడ్స్ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల వారీగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ ఇస్తామని న్నారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు ఈ నెల 10వ తేదీ లోపు సెల్ : 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ,జూలై 31: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకై తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువతీయువకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. బుధవారం కాచిగూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీర్, పాలిటెక్నిక్, డిప్లొమా అర్హతలున్న యువకులు ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 78931 41797, ఆన్‌లైన్‌లో www.nationalcybersecurityindia.orgలో సంప్రదించవచ్చని ఆమె కోరారు.

బాలాపూర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సబితారెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అరవిందర్‌శర్మ, పెండ్యాల నగేశ్

సీఎంగారూ.. ఇదేం సంస్కారం

ఆడవాళ్లను అవమానించడం తగునా?

ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఎమ్మెల్యేకు దక్కే గౌరవం ఇదేనా?

ఎమ్మెల్యే సబితపై ఆరోపణలు చేసే నైతిక హక్కు రేవంత్‌కు లేదు

బేషరతుగా సీఎం క్షమాపణలు చెప్పాలి

పలుచోట్ల సీఎం, డిప్యూటీ సీఎం దిష్టిబొమ్మలు దహనం

ఆర్కేపురం, జూలై 31: ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఎమ్మెల్యేకు దక్కే గౌరవం ఇదేనా? అని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవిందర్‌శర్మ, ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్ విమర్శించారు. బుధవారం అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, ఇతర మంత్రులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో మురుకుంట్ల అరవిందర్‌శర్మ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిండు శాసనసభలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని అవమానించిన సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సబితాఇంద్రారెడ్డిని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ వాళ్లకు లేదన్నారు. రేవంత్‌రెడ్డికి ఏమాత్రం దమ్ము, ధైర్యం ఉన్నా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలను వెంటనే రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికల్లో గెలువాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలోని ఏ ఒక్క వర్గం సంతోషంగా లేరని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిలో కూర్చోవడానికి మహిళలే ప్రధాన కారణమని, అలాంటి మహిళలను విమర్శించి బాధ పెట్టడం తగదన్నారు. వెంటనే ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి బేషరతుగా క్షమాపాణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, జై శ్రీమన్నారాయణ, కంచర్ల శేఖర్, మంత్రి రవీందర్‌రావు, శ్యామ్ గుప్తా, శ్రీరాములు, జహీర్, మురళీధర్‌రెడ్డి, నవీన్‌గౌడ్, అనురాధ, రోజా, పద్మ, జయమ్మ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

బడంగ్‌పేట, జూలై 31 : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బాలాపూర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క దిష్టబొమ్మను బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో దహనం చేశారు. అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అమానించిన రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ యాదవ్, రాజేందర్ రెడ్డి, సిద్ధాల లావణ్య బీరప్ప, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దిండు భూపేష్ గౌడ్, విజయలక్ష్మి, యాదగిరి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సురభి లత, మాధవి, గోపి యాదవ్, బషీర్, నాగరాజు, జంగయ్య, మహేందర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

బాలాపూర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఓయూలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 31: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ.. రేవంత్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు శిగ వెంకటేశ్‌గౌడ్, జంగయ్య, నాగేందర్, అవినాశ్, శ్రీకాంత్, రామకృష్ణ, పవన్, సాయి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ తక్షణమే క్షమాపణ చెప్పాలి : చటారి దశరథ్

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 31: రాష్ట్ర శాసనసభలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి చటారి దశరథ్ తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డిది ముమ్మాటికీ అహంకారమేనని మండిపడ్డారు. రోజురోజుకూ శాసనసభ సంస్కృతి గాడితప్పే విధంగా ఆయన ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన మాటలు తన దురహంకారానికి నిదర్శనమని విమర్శించారు. బడ్జెట్‌పై లేవనెత్తిన ప్రశ్నలకు జవాబు చెప్పాల్సిన ముఖ్యమంత్రి వ్యక్తిగత దూషణకు దిగడం సరికాదన్నారు. తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి.అర్చన

బండ్లగూడ, జూలై 31 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ తీవ్ర స్థాయిలో ఖండించారు. శాసన సభ సాక్షిగా మంత్రిగా అనేక పర్యాయాలు ప్రజలకు సేవలందించిన సబితా ఇంద్రారెడ్డిని అవమానించడం చాలా బాధాకరం అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడుల గురించి అడిగితే అవమానిస్తారా? వెంటనే వారు వ్యాఖ్యానించిన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అగౌరవపర్చడం సిగ్గుచేటు

మాజీ ఎంపీటీసీ తాండ్ర ఇందిరమ్మ

కందుకూరు, జూలై 31: సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అగౌరవపర్చడం సిగ్గుచేటని బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు, మాజీ ఎంపీటీసీ తాండ్ర ఇందిరమ్మ దేవేందర్ తెలిపారు. అపూర్వ అనుభవం ఉన్న ఆమె పట్ల చులకనగా మాట్లాడటం పట్ల తీవ్రంగా ఖండించారు. బుధవారం దాసర్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులతో కలిసి ఆమె మాట్లాడారు. సభ్య సమాజం సిగ్గుపడేలా మహిళలకు తలవంపు తెచ్చేవిధంగా వ్యవహరించారని తెలిపారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయడంతో ఆమెపై కక్షపెట్టుకొని మాట్లాడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, జూలై 31(నమస్తే తెలంగాణ): లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందజేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం డీసీసీ, డీఎల్ ఆర్సీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చేతి వృత్తుల వారికి పీఎం విశ్వకర్మ స్కీం ద్వారా ఆర్థిక సహాయం అందించడం ద్వారా అంతరించిపోతున్న హస్తకళలకు జీవం పోసినట్లు అవుతుందన్నారు. ఈ స్కీంలో దరఖాస్తులు చేసుకునే లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డులు జత చేసి గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు పరిశ్రమల ఏర్పాటుకు రుణాలను బ్యాంకర్లు అందించాలన్నారు. గృహ నిర్మాణం, ఇతర ప్రాధాన్యత రంగాల్లో అర్హులైన పేద లబ్ధిదారులకు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. రైతులకు రుణమాఫీ అయిన దృష్ట్యా బ్యాంకర్లు పంట రుణాలు పునరుద్ధరణ చేయాలన్నారు. ఆర్బీఐ ఏజీఎం శ్రీలక్ష్మి, బ్యాంకు అధికారులు శివప్రసాద్, పల్లవి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నేతన్నల బాధలు పట్టవా?

మాట్లాడుతున్న వెంకట్రాములు

హిమాయత్‌నగర్, జూలై 31: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల వల్ల చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టి.వెంకట్రాములు విమర్శించారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా పాలన చేస్తున్న ప్రభుత్వాలు చేనేత కార్మికుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతున్నాయని ఆరోపించారు. అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వాయిదా తీర్మానం పెడితే.. స్పీకర్ ప్రసాద్‌కుమార్ తిరస్కరించడం సరైన విధానం కాదన్నారు. సంఘం నాయకులు ఎం.జనార్దన్, అశోక్, రాములు, యాదగిరి, రాజయ్య ధనంజయ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'గద్దర్' అవార్డులకు సినీ రంగం చొరవ తీసుకోవాలి

డాక్టర్ జి.వి.వెన్నల గద్దర్

మారేడ్‌పల్లి/ఖైరతాబాద్, జూలై 31: డాక్టర్ సి.నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి 'గద్దర్ అవార్డు'ను ప్రకటించినప్పుడు సినీ రంగం స్పందించకపోవడం బాధాకరమని గద్దర్ కుమార్తె, డాక్టర్ జీవీ.వెన్నెల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రఖ్యాత సినీనటుడు, పద్మభూషన్ అవార్డు గ్రహీత చిరంజీవి స్పందించి 'గద్దర్ నిరంతర శ్రామికుడు' పేరుతో గద్దర్ అవార్డు ఇవ్వడం ఎంతో సముచితమని, గద్దర్ అవార్డు స్వీకరిస్తామని పేర్కొనడం సంతోషకరమని తెలిపారు. ఈ విషయంలో ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి చొరవ తీసుకోవాలని సూచించినందుకు సినీ నటుడు చిరంజీవి, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. గద్దర్‌కు సినీ పరిశ్రమలకు చెందిన రచయితల సంఘం లో, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌లో సభ్యుడిగా గత 45 ఏండ్లుగా సినీ పరిశ్రమతో సంబంధం ఉందని తెలిపారు. 'మా భూమి' చిత్రం ద్వారా నటుడిగా, గాయకుడిగా చిత్రసీమకు పరిచయమయ్యారని, నూతన సాంస్కృతిక, సామాజిక అభ్యుదయ చైతన్యాన్ని చలన చిత్రానికి అందజేశారని గద్దర్ కుమార్తె వెన్నెల తెలిపారు. గద్దర్ అవార్డులకు సంబంధించి సినీ పరిశ్రమ పెద్దలు, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, నిర్మాతల మండలి చొరవ తీసుకోవాలని ఆమె కోరారు. గద్దర్ అవార్డులను ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

బదిలీలు చేపట్టాలని మంత్రి తుమ్మలకు వినతి

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరుతూ బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్, సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి సహకారంతో మంత్రి కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డి, నాయకులు శశిధర్ రెడ్డి, శ్రీనివాస గౌడ్, సంఘం నాయకులు ఉన్నారు.

– చిక్కడపల్లి, జూలై 31

ఘనంగా దాశరథి కృష్ణమాచార్య సంస్మరణ సభ

దాశరథి కృష్ణమాచార్య చిత్రపటానికి నివాళులర్పించిన నాశేశ్వరం శంకరం

ముషీరాబాద్, జూలై 31: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా బుధవారం కవి, సాహితీవేత్త దాశరథి కృష్ణమాచార్య సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త నాశేశ్వరం శంకరం అతిథిగా పాల్గొని దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి జయరాములు, రఘుశ్రీ, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

హమాలీ ధరలు పెంచాలని ధర్నా

ప్రదర్శన నిర్వహిస్తున్న హమాలీ కార్మికులు

ఖైరతాబాద్, జూలై 31 : పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీ కూలీ ధరలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సివిల్ సప్లయి భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున హమాలీ కార్మికులు తమ కూలీ ధరలను పెంచాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా సివిల్ సప్లయి గోదాములలో అతి తక్కువ కూలీ రెట్లకు పనిచేస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీ కార్మికులకు క్వింటాల్‌కు కనీసం రూ.35 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్, సమ్మయ్య, రమణయ్య, రాజయ్య, జకరయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రీజియన్‌కు 111 బస్సులు

ఇంకా 289 ఎలక్ట్రిక్ బస్సులు రావాలి

సికింద్రాబాద్ ఆర్ఎం ఖుస్రో షా ఖాన్

సిటీబ్యూరో, జూలై 31(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 500 ఎలక్ట్రిక్ బస్సుల్లో సికింద్రాబాద్ రీజియన్‌కు 400 బస్సులు కేటాయించామని, అందులో 111 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటి వరకు వచ్చాయని సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్ బుధవారం తెలిపారు. ఇంకా 289 బస్సులు రానున్న ఆర్థిక సంవత్సరంలో వస్తాయన్నారు. ఈ మేరకు ఆయన జేబీఎస్‌లోని కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు సికింద్రాబాద్ రీజియన్‌లో ఉచిత బస్సు పథకం కింద 11 లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారని వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం 65 మెట్రో డీలక్స్ బస్సులు, 140 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు, 60 సిటీ ఆర్డినరీ బస్సులు త్వరలో సమకూర్చుతామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరిధిలో ప్రతిరోజు 1346 బస్సులు నడుస్తున్నాయని తెలిపారు.

సామాజిక సేవలతోనే భగవంతుని అనుగ్రహం

భక్తులకు సందేశం ఇస్తున్న విద్యాభీశతీర్థస్వామి

కాచిగూడ, జూలై 31 : భక్తుల సత్కార్యాలు, సామాజిక సేవలతో భగవంతుని అనుగ్రహం పొందుతారని ఉడిపి పలిమారు మఠం విద్యాధీశతీర్థస్వామి అన్నారు. కాచిగూడ లింగంపల్లిలోని శ్రీ రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో స్వామిజీ 50 రోజుల పాటు 46వ చాతుర్మాస దీక్షల సందర్భంగా రెండవరోజు బుధవారం రాత్రి సుదర్శన హోమం కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీమద్వాచార్యులు పూజించిన శ్రీరామ-సీత-లక్ష్మణుల విగ్రహాలకు ప్రత్యేక పీఠపూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యాధీశతీర్థ స్వామిజీ భక్తులకు అనుగ్రహ సందేశం చేశారు. కార్యక్రమంలో రాఘవేంద్రస్వామి బృందావన సమితి ప్రతినిధులు బీపీ రాఘవేందర్, కృష్ణమూర్తి, అనంతమూర్తి, వెంకటేశ్‌అడిగ, చంద్రశేఖర్, మేనేజర్ కె.నర్సింహాచార్, భక్తులు పాల్గొన్నారు.

'ఇనాం' భూముల సమస్యకు పరిష్కారం చూపాలి

అర్చక సమాఖ్య సమావేశానికి హాజరైన పలువురు. చిత్రంలో రంగరాజన్

మన్సూరాబాద్, జూలై 31:ఆలయాల భూముల విషయంలో ఇనాందార్ అనుభవదారుడి కాలం పహనీలో లేకపోవడంతో వివిధ గ్రామాల్లోకి వంశ పారంపర్య అర్చకులు లబ్ధి పొందలేక పోతున్నారని చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు, సంఘం గౌరవ అధ్యక్షుడు రంగరాజన్ తెలిపారు. తెలంగాణ ఇనాందారుల వంశపారంపర్య అర్చక సమాఖ్య సమావేశంలో బుధవారం ఎల్బీనగర్, చంద్రపురికాలనీలో శ్రీవైష్ణవ సేవా సంఘం కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్రంలోని అర్చకుల హక్కులు, ఇనాం భూముల సంరక్షణ, పలు సమస్యల పరిష్కారానికి నూతన అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు. రంగరాజన్ మాట్లాడుతూ..అర్చకుల పోరాటాలతో 2007లో నాటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 30/87 జీఓను 33/2007గా సవరించిందన్నారు. చట్టాన్ని సవరించి 17 ఏండ్లు కావస్తున్నా అధికారులు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో గతంలో సుప్రీంకోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉందని, అదేవిధంగా శాసనసభ తీర్మానం ఉన్నప్పటికీ అధికారులు అమలు చేయకపోవడం తెలంగాణ ఇనాందారుల అర్చక సమాఖ్యను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వైఎస్ఆర్ ప్రభుత్వం సవరించిన చట్టాన్ని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఇనాందారుల వంశపారంపర్య అర్చక సమాఖ్య ఎదుర్కొంటున్న సమస్యను త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య అధ్యక్షుడు, యాదగిరిగుట్ట రిటైర్డ్ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, ప్రధానకార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు వి.రామానుజచారి, శ్రీవైష్ణవ సేవా సంఘం తెలంగాణ అధ్యక్షుడు ఎస్టీ చారి తదితరులు పాల్గొన్నారు.